క్లుప్తంగా...

ఎస్‌పీఆర్ టోర్నమెంట్ విజేత 'పల్లవి'



కంటోన్మెంట్: జింఖానా మైదానంలో జరిగిన ఎస్పీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ టైటిల్‌ను పల్లవి క్రికెట్ అకాడమీ గెలుచుకుంది. ఐదు రోజుల పాటు నిర్వహించిన టోర్నమెంట్‌లో పల్లవి, కల్యాణ్ జట్లు ఫైనల్‌కు చేరాయి. విజేత, రన్నరప్ జట్లకు ఎస్పీఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ రణదీర్‌రెడ్డి ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా రణదీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్పీఆర్ గ్రూప్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు సింగిరెడ్డి పాండు రంగారెడ్డి జ్ఞాపకార్థం తాము ప్రతీయేటా అక్టోబర్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో వేర్వేరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఇఫ్లూలో ఆంగ్ల నైపుణ్య శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన ప్రతినిధులతో వీసీ ప్రొ.సురేష్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో ఆంగ్ల నైపుణ్య శిక్షణ ప్రారంభమైంది. సోమవారం వీసీ ప్రొ.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించగా కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి అభిలాష్ జోషి ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. నవంబరు 10 వరకు కొనసాగే శిక్షణలో 28 దేశాలకు చెందిన 95 మంది అభ్యర్థులు ఆంగ్లంలో శిక్షణ పొందనున్నట్లు పీఆర్వో తెలిపారు.

డిసెంబర్ 12 నుంచి 16 వరకు ఎక్సాకన్-2023

సనత్‌నగర్: డిసెంబర్ 12 నుంచి 16 వరకు బెంగళూరులో అతిపెద్ద సీఐఐ ఎక్సాకన్-2023 ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు స్టీరింగ్ కమిటీ సభ్యుడు శక్తికుమార్ వీజీ తెలిపారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన సన్నాహక సమావేశంలో వివరాలు వెల్లడించారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ పరికరాల మార్కెట్‌గా ఎదగడానికి ఎక్సాకన్ సిద్ధంగా ఉందని అందులో భాగంగా నిర్వహించే ఎగ్జిబిషన్‌లో యూఎస్ఏ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూఏఈ, దక్షిణ కొరియా, సింగపూర్, టర్కీ, శ్రీలంక, రొమేనియా తదితర దేశాల నుంచి 1200 మంది ప్రదర్శనకారులు వస్తారన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

అమీర్‌పేట: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన సోమవారం జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో సనత్‌నగర్ నియోజకవర్గం అమీర్‌పేటకు చెందిన వ్యాపారవేత్త, బీజేపీ సీనియర్ నాయకుడు ఉత్తమ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి తలసాని చేపట్టిన అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నానని ఉత్తమ్‌కుమార్ తెలిపారు. బీజేపీలో పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు గుర్తింపు లేదని ఆరోపించారు.

కాంబాట్ తైక్వాండో సత్తా



రసూల్‌పురా: తిరుమలగిరికి చెందిన అవినాష్ బొలిశెట్టి ఇటీవల చెన్నై లో జరిగిన కాంబాట్ తైక్వాండో సత్తా చాటి జాతీయ పోటీలను ఎంపికయ్యాడు. అకాడమీ కోచ్ నరసింహ మాట్లాడుతూ.. తమ కాంబాట్ తైక్వాండో స్పోర్ట్ అకాడమీకి చెందిన అవినాష్ సీబీఎస్ఈ సౌత్ జోన్ తైక్వాండో పోటీల్లో అండర్-14 37 కిలోల తక్కువ బరువు బాలుర విభాగంలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించాడని చెప్పారు. సీబీఎస్ఈ జాతీయ పోటీలకు తమ విద్యార్థి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

అభయ ప్రదాత.. దుర్గామాత

- భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక పూజలు, అన్నదానాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారు సోమవారం బాలాత్రిపుర సుందరి దేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్ర ఆయా మండపాలను ప్రజాప్రతినిధులు, స్థానికులు దర్శించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం









దుర్గామత పూజలో పాల్గొన్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న రవాణాశాఖ కమిషనర్ పాండురంగ నాయక్



పోచమ్మ ముత్యాలమ్మ సమేత కనకదుర్గ దేవాలయంలో అన్నదాన కార్యక్రమం



బేగంపేట ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ ఆలయంలో భక్తులు



బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో ట్రస్టీ సుభాష్‌ముదిరాజ్

విజయీభవ





బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారైన నేపథ్యంలో సోమవారం ఆయా అభ్యర్థులకు సీఎం కేసీఆర్ బీ-ఫారాలను అందజేశారు. సికింద్రాబాద్ నుంచి టీ.పద్మారావుగౌడ్, కంటోన్మెంట్ నుంచి లాస్య నందితకు సీఎం క్యాంపు కార్యాలయం బీ-ఫారం అందజేసి విజయం సాధించాలని ఆశీర్వదించారు. –సికింద్రాబాద్/కంటోన్మెంట్

అభివృద్ధి పనులే మళ్లీ గెలిపిస్తాయి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి మరోమారు విజయం సాధిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుట్ట నుంచి తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా తన గెలుపు ఈమారు మరింత సునాయసం అవుతుందన్నారు. నియోజకవర్గంలో ఐదు దశాబ్దాలుగా చేపట్టని అభివృద్ధి పనులు గడచిన తొమ్మిదేళ్లలో చేపట్టామన్నారు. పార్శిగుట్టలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన పద్మారావుగౌడ్‌కు బౌద్ధనగర్ డివిజన్ వాసులు ప్రజలు ఘన స్వాగతం పలికారు. బతుకమ్మలు, బోనాలతో ప్రారంభమైన ర్యాలీ పార్శిగుట్ట సంజీవపురం, అశోక్‌నగర్, మధురానగర్, రాజీవ్‌నగర్, అంబర్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించిన పద్మారావుగౌడ్ తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మహిళ హల్‌చల్..

పద్మారావు ప్రచారంలో ఓ మహిళ హల్‌చల్ చేసింది. ఒకవైపు ప్రచార కార్యక్రమం జరుగుతుండగా మరోవైపు మహిళా పోరాట సమితి నాయకురాలైన డప్పు సునీత నిరసన వ్యక్తం చేసింది. పద్మారావు ఎన్నికల ప్రచారానికి వస్తే నిలదీస్తా అంటూ డప్పు వాయిస్తూ నిరసన తెలిపింది. తమ ప్రాంతంలో జనవాసాల మధ్య మద్యం దుకాణం ఉందని దీంతో మహిళలు, పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయింది. ఇదిలా ఉండగా పద్మారావు ప్రచార ర్యాలీ ఆమె నివాసం వైపు రాకపోవడంతో ర్యాలీ వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. అయితే.. డప్పు సునిత పద్మారావు నేతృత్వంలో టీఆర్ఎస్‌లో పనిచేశారు. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేయడం గమనార్హం.



ఎన్నికల ప్రచారం చేస్తున్న టీ.పద్మారావుగౌడ్

మానవ జీవన వికాసానికి బ్యాంకులు దోహదం

రాంగోపాల్‌పేట్: ప్రతి వ్యక్తి ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకునేలా తోడ్పాటునందించడంతో పాటు మానవ జీవన వికాసానికి బ్యాంకులు దోహదపడతాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి లక్ష్మి పార్థసారధి అన్నారు. ఆదివారం రాత్రి పద్మావతి కోఆపరేటివ్ బ్యాంకు సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ప్యారడైజ్ ప్రాంతంలోని హర్యానా భవన్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. యువ పారిశ్రామికవేత్తలు, చిన్నచిన్న వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తూ వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు బ్యాంకులు చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ చకిలం వెంకటేశ్వరరావు, సీనియర్ మేనేజర్ పుల్లయ్య 25 ఏళ్లలో బ్యాంకు సాధించిన విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మోహన్‌కుమార్, ఫౌండర్ డైరెక్టర్ గాదే శ్యామ్, సీఈవో సూర్యనారాయణ, డైరెక్టర్లు ఆనంద్ కుమార్, డాక్టర్ శ్యాం, నాగభూషణం, కేవీఆర్ ఆంజనేయులు, ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మీ పార్థసారథి

'బీఆర్‌ఎస్‌ది మోసపూరిత మేనిఫెస్టో'



ప్రచారంలో పాల్గొన్న సుష్మీత శంకర్రావు

రసూల్‌పురా: ఓటర్లను మభ్యపెట్టి మూడోసారి అధికారం చేజిక్కించుకునేందుకు సీఎం కేసీఆర్ మోసపూరితమైన మేనిఫెస్టో విడుదల చేశారని బీజేపీ సీనియర్ నాయకులు సుష్మీత శంకర్రావు ఆరోపించారు. సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గం మూడవ వార్డు కార్ఖానలో ఇంటింటికి బొట్టు కార్యక్రమం నిర్వహించారు. దశలవారీగా అమలు చేస్తామని సంక్షేమ పథకాలు ప్రకటించడం సీఎం కేసీఆర్‌కు మాత్రమే చెల్లిందన్నారు. అధికారం కోసం బీఆర్ఎస్ నేతలు పడరాని పాట్లు పడుతున్నారని వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు పట్టం కడుతారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నగర ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ వినోద, వార్డు అధ్యక్షులు కనకరాజు, ఉపాధ్యక్షులు దీపక్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ టికెట్ మాదిగలకు కేటాయించాలి

కంటోన్మెంట్: ప్రధాన రాజకీయ పక్షాలు కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్‌ను మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నేత ఇటుక శ్రీ కిషన్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలకు టికెట్ కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. మాదిగలను పక్కన పెట్టాలని భావించిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పుతామన్నారు. ఇకనైనా అన్ని ప్రధాన పార్టీలు ఆలోచించి మాదిగలకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. అజిత్ కల్యాణ్ వాల్మీకి, బ్యాగరీ నరసింహ, మంద మధుకర్ మాదిగ, చింతల చెరువు అంజమ్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీ కిషన్

వైద్యరంగంలో అనస్తీషియా కీలకం



ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ వైద్యులు

గాంధీఆస్పత్రి: వైద్యరంగంలో అనస్తీషియా విభాగం అత్యంత కీలకమని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ అనస్తీషియాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ.. వైద్యచికిత్సలు, ట్రామాకేర్, సర్జరీలు, దీర్ఘకాలిక నొప్పులు తదితర అంశాల్లో అనస్తీషియా వైద్యులే కీలకంగా వ్యవహరిస్తారన్నారు. అనస్తీషియా, కేన్సర్ కేర్ నినాదంతో గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో చైతన్య ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ హెచ్ఎల్ రాణి, వైద్యులు నాగార్జున చక్రవర్తి, మురళీధర్, శ్రీదేవి పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.9,81,250 స్వాధీనం

అమీర్‌పేట: ద్విచక్ర వాహనంలో డబ్బులు తీసుకెళ్తున్న ఓ వ్యక్తి నుంచి నగదు స్వాధీనం చేసుకున్న ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం బల్కంపేటలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఖైరతాబాద్ ఆర్టీసీ కాలనీకి చెందిన హెచ్‌పీ గ్యాస్ ఉద్యోగి ఎం.రామ్‌కిషోర్ హోండా యాక్టీవా ద్విచక్ర వాహనంపై రాగా తనిఖీ చేయగా రూ.9,81,250 నగదు గుర్తించారు. నగదుకు సంబంధించిన సరైన వివరాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఉల్లంఘనలపై 'సీవిజిల్'లో ఫిర్యాదు చేయండి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిషన్‌రావు

సనత్‌నగర్: ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని సనత్‌నగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కిషన్‌రావు స్పష్టం చేశారు. తమ తమ ప్రాంతాల్లో ఓటర్లను ప్రలోభపెట్టేలా రాజకీయ నేతలు వ్యవహరిస్తున్నట్లయితే స్థానికులు వెంటనే సీవిజిల్ (సీవీఐజీఐఎల్) యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నిబంధనలకు మించి నగదు తరలించడం, ఓటర్లకు తాయిలాలు అందించడం వంటి ఘటనలపై పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ప్రచారంలో ఉపయోగించే వాహనాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. అనుమతి లేని వాహనాలను సీజ్ చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతి కోసం నేరుగా ఆర్వో కార్యాలయానికి రావాల్సిన పని లేకుండా సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎక్కడ కూడా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రాజకీయ నేతల ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది తమకు నిర్దేశించిన విధులు సక్రమంగా జరపడం ద్వారా ఎన్నికలను సజావుగా జరుపుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఆర్ఓ కిషన్‌రావు

శేష వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలలో రెండవ రోజైన సోమవారం స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు. పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారు బుధవారం హంసవాహనంపై భక్తులకు దర్శనమిస్తారని, బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు కోరారు. టీటీడీ నాద నీరాజనం ఫేమ్ వెంకటనాగరాజన్ నేతృత్వంలో నామ సంకీర్తన, గాయత్రీ శ్రీనివాస బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఆయా సాంస్కృతిక బృందాలను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు బాలభాస్కర్, లక్ష్మీనారాయణ, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సృజయ్, రామచందర్ పాల్గొన్నారు.



వెంకటనాగరాజన్ బృందానికి సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

మేనిఫెస్టో ప్రతులు చింపిన ఓయూ విద్యార్థులు



మాట్లాడుతున్న నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను విద్యార్థులు చింపివేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు లైబ్రరీని బహిష్కరించి బీఆర్ఎస్ మేనిఫెస్టోలో సకల జనులను ముచ్చటగా మూడోసారీ మోసగించేలా ఉందన్నారు. పదేళ్లుగా యువత నిరుద్యోగంతో అల్లాడుతుంటే సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయకుండా రాబోవు ఎన్నికలకు రూపొందించిన మేనిఫెస్టోలో కూడా ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. ప్రవళిక ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేదని స్వయంగా మంత్రి కేటీఆర్ అబద్ధాలు చెప్పడం నిరుద్యోగుల్లో మానసిక ఒత్తిడి పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, సత్య, లెనిన్, రఘు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



వేడుకలో విద్యార్థులు



సనత్‌నగర్: బతుకమ్మ వేడుకలతో జెక్‌కాలనీ ప్రత్యేక శోభను సంతరించుకుంటోంది. కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం జెక్‌కాలనీ సౌత్‌రోడ్డులోని వైష్ణవీ సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ వద్ద రంగురంగుల పూలతో అందంగా అలంకరించి తెచ్చిన బతుకమ్మలను ఒక్కచోట పేర్చి ఆడిపాడారు. కాలనీ ఫెడరేషన్ సహకారంతో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణలతో పాటు ఆదిలక్ష్మీదేవి, కేవీ రమణమ్మ, భాగ్యలత, విజయలక్ష్మీ, వాణి తదితరులు ఏర్పాట్లు చేశారు.

అమరావతిలో బతుకమ్మ సందడి

చిలకలగూడ : నామాలగుండు అమరావతి ట్యాలెంట్ స్కూల్ ప్రాంగణంలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ తయారుచేసే పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బతుకమ్మ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. అన్నిమతాలకు చెందిన పండుగలు, పర్వదినాలతో పాటు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలు, మహనీయుల జయంతి, వర్ధంతిలను నిర్వహించి ఆయా రోజుల విశిష్టతలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. మంగళ, జానకీ, దివ్య, మహాలక్ష్మీ, సుధ, లలి త, పద్మావతి, సీత, ప్రవీణ, రాజేశ్వరి, మాధురి, సు నీత, సుభద్ర, రూప, బాలాంజలి, పావనీ పాల్గొన్నారు.

తన బ్యాగు అనుకుని వేరే బ్యాగు తీసుకెళ్లిన వ్యక్తి

- పోలీసుల చొరవతో తిరిగి అప్పగింత



పూనంకు బ్యాగును అప్పగిస్తున్న రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను

సికింద్రాబాద్: తన బ్యాగుకు బదులు మరో లగేజీ బ్యాగును వెయిటింగ్ హాల్ నుంచి ఒక ప్రయాణికుడు తీసుకెళ్లడంతో విలువైన ఆభరణాలు ఆ బ్యాగులో వెళ్లిపోయాయి. జీఆర్‌పీ పోలీసుల కృషి ఫలితంగా కథ సుఖాంతం అయింది. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను కథనం ప్రకారం.. పర్యావరణశాఖలో ఇంజినీర్‌గా పని చేస్తున్న పూనం అనే యవతి భువనేశ్వర్ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చి వెయిటింగ్ హాల్లో కూర్చుంది. కాసేటి తర్వాత వాటర్‌బాటిల్ కోసం వెళ్లి వచ్చేలోపు తన బ్యాగు కనిపించలేదు. అందులో 20 గ్రాముల బంగారు, 100 గ్రాముల వెండి నగలు కొంత నగదు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా కేసు దర్యాప్తు చేస్తుండగానే ఒక వ్యక్తి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. తన ల్యాప్‌టాప్ బ్యాగుకు బదులు మరో బ్యాగును పొరపాటున తీసుకెళ్లినట్లు గుర్తించి బ్యాగును తెప్పించి అప్పగించారు.

ప్రజా సేవే అనునిత్యం



మద్దుర్ల శ్యామ్ సుందర్

బౌద్ధనగర్: సామాజిక సేవలోనే తనకు ఆత్మసంతృప్తి ఉందని సామాజిక సేవకులు, బీజేపీ సీనియర్ నాయకులు మద్దెర్ల శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని బౌద్ధనగర్ డివిజన్‌కు చెందిన శ్యామ్ సుందర్ ఏడేళ్ల వయస్సులోనే ఆయన తండ్రి మరణించడంతో తల్లి మద్దెర్ల సరస్వతిపై కుటుంబ భారం పడింది. తన తల్లి పడిన కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకొని, సమాజంలో అలాంటి వాళ్లు ఎంతో మంది బతుకుతున్నారని, వారికి తనవంతు సహాయంగా వివిధ రూపంలో సేవలందించాలని అనుకున్నానని వెల్లడించారు. మెడికల్ క్యాంపు, బ్లడ్ క్యాంపు, నిత్యావసర వస్తువుల పంపిణీ, దుస్తుల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో పాటు ప్రతీ ఏటా 40 మంది విద్యార్థులను ఉచితంగా చదివించడం, రాత పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేయడం చేస్తుంటారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు ఆర్థిక, సామాజికంగా సహాయ సహకారాలు అందించానన్నారు. 2014లో లోక్‌సభ ఎన్నికల్లో కూడా సోషల్ మీడియా ద్వారా బీజేపీ తరుపున ప్రచారం చేస్తూ ఎంతోమంది ప్రజలను ప్రభావితం చేసినట్లు తెలిపారు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో సైతం తన సత్తా చూపించేందుకు సిద్ధంగా ఉన్నానని, అవకాశం వస్తే నిరూపించుకుంటానని శ్యామ్ సుందర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.